బస్ స్టాప్ దగ్గర - ఎవరో చప్పట్లు కొట్టారు. వెనక్కి తిరిగాను. నీరజ! దగ్గరగా వచ్చింది. "ఎన్నాళ్ళకు, ఎన్నాళ్ళకు?" అని చేయి చాపాను.

"ఎన్నేళ్ళకు అను. పద కాఫీ తాగుదాం." అన్నది. నా చేయి వదలకుండా, గట్టిగా నొక్కుతోంది.

"కాఫీ యా? వద్దమ్మా, బస్సు వెళ్ళిపోతుంది. వూ, చెప్పు ఎలా వున్నావు? ఏం చేస్తున్నావు? బ్యాంకులోనే యింకా ఉద్యోగమా?" అన్నాను. ఒక చూపు బస్సులమీద వుంచుతూనే.

"పోవోయి, మరో బస్సులో వెళ్ళొచ్చునులే. లేకపోతే నేను దింపుతాలే ఆటోలో. పద, వెళదాం కాఫీ అర్జెంటుగా అవసరమనిపిస్తోంది" చనువుగా లాగింది చేయి. వెళ్ళాము. కాఫీ వచ్చేలోగా నీరజను పరీక్షగా చూశాను.

"ఏమిటి చూస్తున్నావు? ఎంత వరకూ మారానా? ఏమంత మారలేదు. ఒక డజను సంవత్సరాల వయస్సు మాత్రం కూడాలి. ఏమిటా పరీక్ష యింకా అట్లాగే చూస్తో? నా ఉద్యోగం బాగానే వుంది. రోజుకి కోటి రూపాయలు వచ్చిపోతుండే బ్యాంక్‌లో కదా? వూఁ యివన్నీ చెప్పినా సంతృప్తి లేదు కదూ? మైడియర్! నేనింకా పెళ్ళి చేసుకోలేదు." అని నవ్వేసింది.

నేను నవ్వి తల దించుకుని, "అవును. తెలుస్తూనే వుంది నీకింకా పెళ్ళి కాలేదని!" అన్నాను.

"తెలిసినా గానీ, ఎంచేత అని నీకు పెద్ద అనుమానం, కదూ" అంటూ ప్రశ్న వేసింది మళ్ళీ.

ఒకప్పుడు నీరజ, నేను చాలా దగ్గిర స్నేహితులం. ఒకరి నొకరు క్షణం కూడా విడువకుండా హాస్టల్లో, కాలేజీలో గడిపినవాళ్ళం. అందుకే నా ఆలోచనలన్నీ యిట్టే చదివినట్లు పసిగడుతుంది. ఇల్లాగే వాద ప్రతివాదాలుగా మా సంభాషణ సాగితే, అసలు విషయం తేలడానికి మరో గంట కావాలి.

అందుకే విషయం తుంచేసి, టూకీగా తేల్చాలని నిశ్చయించుకున్నాను. "అవును. నీకింకా ఎందుకు పెళ్ళికాలేదా అనే నా సందేహం. నీలాంటి మనిషికి పెళ్ళి జరగకపోవటం చాలా ఆశ్చర్యమైన విషయం. నీలో ఆకర్షణవుంది. మగ వాళ్ళని లాగి పట్టగలిగిన స్త్రీత్వం వుంది. ఇంకా ఎంచేత నువ్వు విముఖంగా వున్నావు అనే నా సందేహం." అన్నాను. నాశక్తినంతా కూడదీసుకుని, యింత ధాటిగా వేశాను ప్రశ్నలు. ఎంచేతనంటే నీరజలో నాలోలేని ఒక పదుచుదనం పొగరు తొంగి చూస్తోంది. ఆ ధాటికి నేను నిలవలేననిపించింది;


"ఇంతేనా? యింకా ఏదైనా అడుగుతావా?" అన్నది కాఫీ తాగేసి, కప్పు పక్కకి నెట్టి.

"నీకు వయస్సు పెరుగుతోంటే, చేతిలో డబ్బు పెరుగుతోంటే, కనీసం ఖర్చుపెట్టుకునేందుకైనా ఒక తోడు కావాలి. మనసులో మనసైన మనిషి వుండాలి. ఇక నీ అభిప్రాయం ఏమిటి?"

నీరజ ముఖం మెరుపు తుడిచేసిన మబ్బుల ఆకాశంలా అయింది. "నీతో అబద్ధమాడలేను.

# కలిసిన ధ్రువాలు

తురగా జానకీరాణి



## లోకజ్ఞానం

1. హవామహల్, ఇమామ్‌బరా, విక్టోరియా మెమోరియల్ - ఇవి ఏ నగరాలలో వున్నాయి?
2. ఎవరెస్ట్ పర్వతం కన్న ఎత్తైన పర్వతం ఈ భూమండలం మీద వున్నదా?
3. గ్రామఫోన్ రికార్డులలో 'లాంగ్ - ప్లే రికార్డు' ఒకటి. ఈ రికార్డును కని పెట్టిన వారెవరో చెప్పగలరా?
4. ఈ మధ్య మాస్కోలో జరిగిన ఒలింపిక్ పోటీలను సమ్మర్ ఒలింపిక్స్ అని అంటారు. అదే విధంగా వింటర్ (శీతకాలం) ఒలింపిక్స్ కూడా 1924 నుంచి నిర్వహింపబడుతున్నాయి. ఆ సంవత్సరం తొలి వింటర్ ఒలింపిక్స్ ఎక్కడ జరిగాయి?
5. సినాలజీ అంటే ఏమిటి?
6. జూలై 18, 1980 న మన దేశం తొలి సారిగా అంతరిక్షంలోకి రోహిణి-1 ఉపగ్రహాన్ని పంపింది. మరి 'రోహిణి' అంటే ఏమిటి?
7. స్వశక్తితో అంతరిక్ష కక్షిలోకి ఉపగ్రహాలకు పంపగల శక్తిని సంపాయించిన ఆరవ దేశం - భారత దేశం. తక్కిన ఐదు దేశాలు ఏవి? తమ తొలి ఉపగ్రహాలను అవి ఏ సంవత్సరం అంతరిక్షంలోకి పంపాయి?
8. మన దేశంలోకల్లా పెద్దదైన శాసన సభ నియోజకవర్గం ఏది? గత ఎన్నికలలో ఆనియోజక వర్గంనుండి ఎన్నుకోబడిన వ్యక్తి ఎవరు?
9. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలకు ప్రయాణమవుతున్న మన క్రికెట్ జట్టుకు నాయకుడుగా ఎన్నుకోబడిన వ్యక్తి ఈ ముగ్గురిలో ఎవరు?-గుండప్ప విశ్వనాథ్; సునీల్ గవాస్కర్; వెంకట రాఘవన్.
10. మన ఉపరాష్ట్రపతి ఎవరు?

[సమాధానాలు ఈ సంచికలోనే వున్నాయి. వెతికి మీ సమాధానాలతో సరిపోతాయేమో పోల్చి చూసుకోండి]

డొంక తిరుగుడు జవాబులు చెప్పలేను. చూడు, యీ జీవితం ఏముంది చెప్పు! రెండు బిందువుల మధ్య ఒక గీత. పుట్టుక, చావు. ఈ రెంటింటి మధ్యన వున్న ఒక గీత. జానెడు లేని యీ గీత మీద బతకడానికి మరో సాయం అనవసరం. మరో మనిషి చిరునవ్వులకీ, చిరుకోపాలకీ అర్థాలు వెతికేంత ఓపిక నాకు లేదు. తోడా? నా ఆలోచనలే నాకు బరువవుతోంటే, మరో మనిషి మనస్సులోని భావాలూ, బాధలూ ఎక్కడ పట్టించుకోను?'' అన్నది. కొంచెం ఆగి, చిన్న చిరునవ్వుతో చూసింది నా వంక. "నా కొంగుకి ఒక ముడి వేస్తే అది మరో బరువు. ఇప్పుడు నా కొచ్చిన లోటేముంది? హాయిగా వున్నాను. పెళ్ళిలోపడి, మునిగి, ఈతరాక అవస్థలు పడేకంటే, ఇల్లా ఒడ్డున కూర్చోడమే బావుంది. చాలా ఆలోచించాక పెళ్ళి అనే పదాన్ని నా డిక్షనరీలోంచే తీసేశాను. అంత అవాంతరంగా ఒక ప్రేమ నన్ను ముంచడం కలలో సంగతి. వూ అదేమిటి, కాఫీ యింకా తాగవేమిటి?'' అన్నది.

ఈ కొంగుకి ఒక ముడిబరువా? పిచ్చిదానా, ఆ బరువుకోసమే లక్షల మంది కన్నెపిల్లలు కలలు గంటున్నారు. వారి అమ్మ, నాన్నలు అలమటించి పోతున్నారు-అనుకున్నాను. కానీ, కాఫీ హోటల్లో బల్లముందు కూర్చుని, గబగబ వాదించి, తేల్చ వలసిన విషయం కాదిది. కాఫీ గొంతులో పోసుకుని,

"ఓకే, యింకా ఏమిటి చెప్పు విశేషాలు?'' అంటూ తేలిగ్గా మాట్లాడే యత్నంతో లేచాను.

*

బస్‌స్టాండు ఒక రైల్వే ప్లాట్‌ఫారంలా ఉంది. "హల్లో!'' పెద్దకేక నా పక్కనే, నా బుజం మీద చేయిపడింది. శకుంతల! నా కళ్ళల్లో తడి సంతోషంతో. తన కళ్ళల్లో మెరిసిపోతున్న ఆనందం నన్ను చూసి. స్నేహమంటే యిదే, తనని చూడడంతోనే ఎందుకో నా మనస్సిల్లా పొంగింది సముద్రంలా! చేతులతో దగ్గరగా లాక్కోవాలన్న ఆప్యాయత నన్నూపేస్తోందే!

"శకూ!'' అన్నాను. "రా, పార్కులో కూర్చుందాం కాస్సేపు'' అన్నది. నా చేయి వదల లేదు. ఇద్దరం గొప్ప ప్రేమికుల్లా నడుస్తూ బయలు దేరాం పార్కులోకి. అరటిపళ్లు, పల్లీలు కొనుక్కున్నాం. తింటూ కబుర్లు ప్రారంభించాం. నేను బస్సు మాటే మర్చిపోయినట్లుగా కూర్చుండి పోయాను. ఒకరినొకరు చూసుకోవడంతోనే సరి పోతున్నది. కాస్సేపయాక అడిగాను.

"శకూ! నీ పిల్లలు నలుగురూ బుద్ధిమంతులేనా? మీవారిని ఒక్కసారే చూచాను పెళ్ళిలో. ఇప్పుడెలా వున్నారు! ఈపాటికి నువ్వింకా రాలేదని వాళ్ళంతా ఎదురు చూస్తుంటారేమో!'' అన్నాను.

"బొనమ్మా, వెళ్ళాలి. పోనీలేగానీ, యింకా చెప్పు మనవాళ్లెవరైనా కలుస్తోంటారా ఎప్పుడేనా?'' అన్నది శకుంతల.

"ఎవరో ఒకరు కనిపిస్తోనే వుంటారుగానీ, చెప్పు నీ పిల్లల్ని గురించీ, మీ ఆయన్ని గురించీ. సంతోషంగా కబుర్లు చెప్పవేం శకూ, అంత యిష్టపడి పెళ్ళి చేసుకున్నావు?'' అన్నాను చనువుగా.

"ఏముందే చెప్పేందుకు? సంతోషంగానే వున్నాను. సరేనా? నా పిల్లలు బాగానే చదువుకుంటున్నారు. నేనంటే వాళ్ళందరికీ చాలా ఇష్టం. అంతేకదా నీ సందేహం?'' అన్నది పొడిపొడిగా.

ఈ మాటల్లో నిండైన ఆనందం ధ్వనించడం లేదే? నేను చాలా అదృష్టవంతురాలినే అంటుందేమోనని ఆశపడుతున్నాను. కానీ, ఆమె మాటలు అల్లాలేవు. చిన్న కొరత!

"శకుంతలా! చల్లని సంసారంలో పచ్చని గృహలక్ష్మిలా బతుకుతున్న నువ్వు యిల్లా ముక్తసరిగా మూడు ముక్కల్లో తేల్చేస్తావేమిటి నీ సౌభాగ్యం గురించి? నేనింత ప్రాణ స్నేహితురాల్ని కదా! నువ్వు సుఖంగా వున్నావని వింటే సంతోషించే నాతోనే ఎందుకిల్లా మాట్లాడుతున్నావు, ఏదో దాస్తున్నట్లు?'' అన్నాను.

శకుంతల నా కళ్ళల్లోకి చూచింది. చిన్నగా ముదు

చుకున్నాయి ఆకళ్ళు. "ఏం చెప్పను! నాకు బతుకులో సారం ఏమిటో తేలిపోయిందే! అందరం మరొకరికి సుఖం యివ్వడానికే పుట్టాము. ఎంత దగ్గరయినా, ప్రతియిద్దరి మనుష్యుల మధ్య ఒక పెద్ద అగాధం వుంటుంది. భార్యకీ, భర్తకీ మధ్య. తల్లికీ, పిల్లకీ మధ్యన కూడా ఆ అగాధం వుంటునే వుంటుంది.

ఒకరి కొకరు అతి దగ్గరగా వుండేది కొన్ని నిముషాలే! ఆ తర్వాత ఎవరికివారే! ఎవరి గుండె వారిదే, ఎవరి గుండె చప్పుడు వారిదే. ఎదుటి గుండె మనకి వినబడదే? సంసారం సాగరం అన్నారా, నేను అందులో పడి, మునిగి తట్టుకుని, వూపిరాడక అలసిపోయాను. ఏ కెరటం, ఏగాలి ఎటు తోస్తే అటు పోవడమే నా పని. ఆ సముద్రంలో ఇంక నాకు ఆనందమేమిటి? నావిధి ఏదో నేను నెరవేర్చాలి. అంతే. పొంగి పోయేందుకు ఏమీలేదు యిందులో. ఇదంతా యింత వివరంగా తేలేక, నా సౌభాగ్యాన్ని గురించి నీతో ఏమి గొప్పలు చెప్పుకో మంటావు?" అన్నది.

ఆ చిరు చీకట్లో, నేను తెల్లబోయాను. పిచ్చిదానా, యిష్టమైన ఒక జత కళ్ళల్లోకి చూస్తూ, ఎగసిపడే గుండెను ఏం చేయాలో తెలియక తబ్బిబవుతారు అమ్మాయిలు. చిటికెన వ్రేలి కదలికలో తన ప్రాణప్రియుని మనోభావం గుర్తించి, మనస్సులో మనస్సుగా బ్రతుకుతారు యిల్లాళ్ళు! అమ్మా అనే తేనెపిలుపులోని తీపిని జుర్రి మత్తెక్కిన కళ్ళతో లోకాన్నే చిన్నచూపు చూస్తారు తల్లులు! మరి, నువ్వెందుకమ్మా యింత తేలిగ్గా మాట్లాడుతున్నావు. నీ సంసారం గురించి? అన్నవి నాలో గిర్రునతిరిగే ప్రశ్నలు.

ఇద్దరం గూళ్ళకి చేరవలసిన పక్షులం. ఇప్పుడు నేను వేసే ప్రశ్నలు కావు యివన్నీ.

రైల్వే ప్లాట్‌ఫారం లాంటి బస్సుస్టాండుకి నేను రోజూ వస్తూనే వున్నాను. అప్పుడప్పుడు అటు నుంచి వస్తుండే నీరజ, యింకా వద్దునే కూర్చున్నది. ఇటు నుంచి వచ్చి, తారసపడే శకుంతల నిండా మునిగే వున్నట్లు కనిపిస్తుంది. ఏంచేతో యిద్దరికీ, యీ సంసారసాగర సౌందర్యం కంటికి ఆనడం లేదు. రస హీనమైన ఒకే పల్లవి ఆలపించారు నా చెవుల్లో.


సుమధురమైన ఆ సాగర సంగీతమే వినబడని వాళ్ళకి. నీరసమైన నా మాటలేం వినబడుతాయి! ఆ రెండూ కలసిన ధ్రువాలు! ◘

## కొత్తరకం ముగ్గు

మొదట 17 చుక్కలు 17 వరుసలుగా పెట్టుకోవాలి. తరువాత రెండవ చిత్రంలో చూపినట్లుగా ముగ్గు వేసుకుంటే చతురస్రాకారంలో అందమైన ముగ్గు పూర్తవుతుంది.

కె. సుకన్యారావు

Vemakoti Seeta Rama Sastry
WRITER AF EB JAO (Feld)
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM.



## కావ్యనాయికలు:

# సావిత్రి



కథకు వ్యాసుడు, కవితకు కాళిదాసు; వీణకు వాణి, విజయానికి కిరీటి; దయకు బుద్ధుడు, దాతృత్వానికి కర్ణుడు—అంటూ ఒక్కో విశిష్టగుణానికి ఒక్కో మహనీయుని ఉదాహరణగా చెప్పడం మన దేశంలో యుగయుగాల ఆనవాయితీ. ఆ విధంగా పాతివ్రత్యంలో ప్రథమ తాంబూలం అందుకునే సాధ్వీమణి సావిత్రి!

పతివ్రత అంటే పతియే ప్రత్యక్ష దైవం అనుకుంటూ వ్రతాలతో మాత్రమే కాలక్షేపం చెయ్యకుండా విధి రాసిన తలరాతను చెరిపేసి, విధినే మార్చుకున్న బంగారు చేతులు ఆమెవి! అందుకే ఆమె జీవిత అమావాస్య నిశిలో అందాల జాబిలిని ఉదయింపజేసుకోగలిగింది. హాలాహలాన్ని అమృతంగా మార్చుకోగలిగింది. మరణదేవుడే ఆమె పాలిట జీవన ప్రదాత అయ్యాడు!

వనితాలోకానికి అలంకార ప్రాయమైన సావిత్రి కథను అరణ్యవాసం చేస్తోన్న ధర్మరాజుకు మార్కండేయుడు వినిపించినట్లు మహాభారత కథనం.

మద్ర దేశానికి రాజైన అశ్వపతికి చాలాకాలం

వరకు సంతాన ప్రాప్తి లేకపోవడంతో ఎన్నో సంవత్సరాలు సరస్వతీ దేవిని ఉపాసించాడట. సావిత్రీదేవి వరంతో పుట్టడంవల్ల తన గారాల పట్టికి ఆ దేవదేవి పేరే నామకరణం చేసి పెంచ సాగాడు అశ్వపతి.

సావిత్రి దిన దిన ప్రవర్థమానంగా పెరిగి యౌవనవతి అయ్యేసరికి అరబూచిన గులాబి పరిమళంలా ఆమెలో అందచందాలతోపాటు సుగుణ సంపదా, చదువు సంధ్యలు, విలు విద్యా పాటవం చోటుచేసుకున్నాయి.

విలువిద్యలమీది అభిలాష కొద్దీ ఓ రోజు తండ్రిగారితో పాటు తానూ వేటకు వెళ్ళింది. అడవిలో వేటాడి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఓ సుందర ముని కుమారుని సాత్త్విక మనోహర రూపాన్ని చూసి ముగ్ధురాలయింది. నవ యౌవన సుందర రూపాలతో వున్న ఇరువురి చూపులూ పలకరించుకున్నాయి.

సావిత్రి రాజ ప్రాసాదానికి చేరుకున్నా ఆమె మనసు మాత్రం ఆ సుందర సుకుమారుని వదలి రాలేకపోయింది. ఇంతలో తన కుమార్తెకు వివాహం చేయించాలన్న ఉద్దేశంతో వివిధ దేశాల యువ రాజుల చిత్రపటాలను రావించాడు అశ్వపతి. ఆ పటాలను కనీసం కన్నెత్తి చూడకుండా మనసులో ముద్రవేసుకుపోయిన ముని కుమారుని సుందర రూపాన్ని ఓ చిత్రంగా గీసి దానిని తన చెలికత్తెల ద్వారా తండ్రిగారి సమక్షానికి పంపింది.

ఆ సుందరాకారుడెవ్వడని ఆరా తియ్యగా సత్యమే వ్రతంగా గల సత్యవంతుడనీ రాజ్యభ్రష్టుడై కళ్ళుపోయి కాననలపాలైన సాళ్వ దేశాధిపతి ద్యుమత్సేనుని కుమారుడనీ తెలియవచ్చింది. ఇంకా వివరాలు తెలుసుకోడానికి త్రిలోక సంచారియైన నారదుని సంప్రదించారు. సత్యవంతుడు సకల సద్గుణ సంపన్నుడే గాని — పెళ్ళయి యేడాది తిరిగేలోపల మరణిస్తాడన్న 'దేవరహస్యాన్ని' నారదుడు తెలియజేశాడు. అపశకునంలా భావించిన అశ్వపతికి తన తపో పుత్రిని సత్యవంతుడికి ఇవ్వడానికి మనసొప్పలేదు.

కాని మనిషి మనోవాక్కాయాలలో మనసు ప్రధానమైనది. ఓసారి చూసి మనసారా ప్రేమించిన యువకుని తప్ప మరొక్కరిని మనువాడనని పట్టు పట్టింది సావిత్రి. కూతురి కోర్కెను కాదనలేక అశ్వపతి సత్యవంతుని తండ్రిని సంప్రదించాడు. "వియ్యం, నెయ్యం కయ్యం సమ వుజ్జీలుగా వున్నప్పుడే రాణిస్తాయి. కాని ఇవాళ మేము రాజ్యం, ఇల్లూ వాకిలి సర్వం పోగొట్టుకుని అడవుల్లో వుంటున్నాము. ఈ సంకట పరిస్థితిలో రాజ కుటుంబంతో వియ్యం చేయడం సబబు కాదేమో అని అనుమానాన్ని వ్యక్తం చేశాడు ద్యుమత్సేనుడు. "కలిమిలేములు కావడి కుండలు. గద్దెలు మిద్దెలు శాశ్వతాలు కావు. మనిషికి కావలసినవీ శాశ్వతమైనవీ మంచి గుణగణాలు. అంచేత ఒకరినొకరు ప్రేమించుకున్న అనన్య గుణాకరులైన ఈ ఇద్దరికీ పెళ్లి చేయడం పెద్దలైన మన బాధ్యత" అని అశ్వపతి నచ్చ జెప్పడంతో ద్యుమత్సేనుడు కూడా అంగీకరించాడు.

అరణ్యం మధ్య మునిఆశ్రమంలో ఓ శుభ ముహూర్తాన సావిత్రీ సత్యవంతుల వివాహం జరిగింది. అత్తమామలకు సేవలు చేస్తూ పతితో అన్యోన్యంగా కాపురం చేసి ఆదర్శ గృహిణిగా ఋషి పత్నుల మన్ననలు పొందుతున్నప్పటికీ సావిత్రి మనసులో నారద మహర్షి చెప్పిన గడువు కోసం క్షణాలు లెక్కపెడుతూ కాలం గడప సాగింది. ఆ దుర్దినం రానే వచ్చింది. ఆ రోజుకి మూడు రోజుల ముందు నుంచే 'బాలత్రిరాత్రోప వాస' వ్రతాన్ని కడు భక్తి శ్రద్ధలతో చేయ సాగింది.

ఆరోజు ఉదయం సమిథలు తేవడానికి సత్య వంతుడు అడవికి బయలుదేరినప్పుడు తనూ వెంట వస్తానంది. అత్తమామల అనుమతి సంపాయించింది. భర్త మొదట వద్దన్నా - "ఈ అందమైన అడవి 'ఉజ్వల పుష్ప పల్లవ ఫలా విర్భూతి నానా లతాగ్ర పరీతంబ'ని ప్రతీతి. దానిని చూడాలని కుతూహలంగా వుంద"ని బ్రతిమలాడి భర్తను ఒప్పించింది.

వినీల ఆకాశంలో రాయంచల్లా కదిలే తెల్లటి మేఘాలతో పోటీపడి పరుగెత్తే కొంగలబారులు; చిన్న చిన్న కొండలమీంచి వెండి నదుల్లా గల గల సాగే తియ్యటి సెలయేళ్లు; వాటికి ఇరువైపులా దట్టమైన ఫల వృక్షాలు; ఆ వృక్షాలకు రంగు రంగుల పువ్వులతో అల్లుకుపోయిన అందాల లతలు; పళ్లు తింటూ కర్ణానందంగా పలికే రామ చిలుకలు; ప్రకృతి సౌందర్యానికి పరవశించి పాడే కోయిలమ్మల తియ్యటి పాటలు - వీటిని మైమరచి అభివర్ణిస్తూ చూపుతూ సత్యవంతుడు అడవిలో నడువసాగాడు. ఇంతలో సంధ్యా సమయం ఆసన్నమయింది.

సమిథలు నరుకుతూన్న సత్యవంతుడు గొడ్డలి ప్రక్కనకు విసిరి శిరో బాధతో నేలకు ఒరిగాడు. తత్తరపాటుతో పతి తలను తన ఒడిలోకి చేర్చుకుంది సావిత్రి. ఆమె మనసులో తుపాను చెల రేగింది. సత్యవంతుడు స్పృహ కోల్పోయాడు. భీకర గంభీర రూపంలో కాలుడు లీలగా ఆమె కట్టెదుట కనబడ్డాడు. అసలు సంగతి ముందే తెలుసు గనుక - భార్య ప్రాణాలతో ఉండగా భర్త పోవడం భరించరానిదనీ కావాలంటే తన ప్రాణాలను తీసుకుని తన భర్తను బ్రతికించమని పరిపరివిధాల ప్రార్థించింది. కాని ఆమె ప్రార్థనలను లెక్క చేయకుండా యముడు దక్షిణ దిశగా పయనమయ్యాడు. అడ్డంకులన్నిటినీ దాటుకుని యముని వెంబడించింది సావిత్రి. "లోకంలో ధర్మం జరగడం ధర్మవర్తనుల ద్వారానే సాధ్యం. ధర్మస్వరూపులైన మీలాంటి పెద్దలను దర్శించడం నాకు మంచి జరగడానికేకాని మరొకటి కాదు. మీలాంటి గొప్పవారిని దర్శించి ఒట్టి చేతులతో ఎలా తిరిగి వెళ్ళడం?" అని యముని మెప్పించింది. ఆమె చమత్కార సంభాషణకు సంతసించిన యముడు, "నీ భర్త ప్రాణం తప్ప వేరే ఏ వరం కావాలన్నా కోరుకో" అన్నాడు. "నా అత్తమామలు కళ్లు లేకుండా వున్నారు. వారికి దృష్టిని ప్రసాదించండి" అని ప్రార్థించింది. "అలాగే" అన్నాడు యముడు. "పోయిన రాజ్యం రావాలి" అంది. "వస్తుంది" అని వరమిచ్చిన యమధర్మరాజు, "సరి యింక వెళ్ళు చాలా దూరం వచ్చి అలసిపోయావు. పతి ప్రాణాలకై వృథాగా ప్రయాసపడకు" అని హెచ్చరించాడు. కాని సావిత్రి మాత్రం, "పతిచరణ కమలాలే సతిప్రాణ నిలయాలు అన్నది మీరెరుగని ధర్మమా? అయినా నాకో వంశోద్ధారకుడు కలిగేట్టు వరం ప్రసాదించండి. అదే పదికోట్లు" అని చేతులు జోడించింది. ఎంత చెప్పినా వినకుండా వెంటబడి పతి ప్రాణాలకోసం పరితపిస్తున్న ఆమె వేదనను, మెట్టినింటి మీది ఆప్యాయతను, ధర్మనిరతిని, వాక్చాతుర్యాన్ని చూసి సంతసించిన యమధర్మరాజు – సావిత్రికి వంశోద్ధారకునితోపాటు సత్యవంతుని ప్రాణాలను కూడా ప్రసాదించాడు.

'ఇంటికి దీపం ఇల్లాలు' అన్న విశ్వాసం మన తరతరాల ఆశాదీపం. కాలుని మెప్పించి కాలాన్ని జయించిన సావిత్రి జీవితం ఇల్లాలి ఔన్నత్యానికి మరింత వన్నె, పవిత్రత సమకూర్చే అజరామర కావ్యం!

*